
# సత్యవాక్యము

## క్రైస్తవ మాసపత్రిక




**April 1994**

# THE WORD OF TRUTH

# సంక్షిప్త వార్తలు

మార్చి నెల సువార్తికుల సదస్సు రామచంద్రపురం జి. కొత్తూరుల్లో 22వ తేదీన దిగ్విజయంగా జరిగెను. అనేక ప్రాంతముల నుండి తరలి వచ్చిన సువార్తికుల సమక్షంలో "క్రీస్తు నామమునకున్న విశిష్టత యేమి? సంఘము క్రీస్తు నామమున పిలువబడవలెనా?" అనుగొప్ప అంశము చర్చింపబడెను.

సమావేశమునకు సోదరులు పి.జె. కృపాలినిగారు అధ్యక్షత వహించిరి. సోదరులు M. ఆల్ఫ్రెడ్ గారు, పి. ప్రకాశంగారు, బి. యోహానుగారు చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశములో సోదరులు వి. చిన్నయ్యగారు, పి. సమూయేలుగారు, పి. స్టీవెన్‌సన్ గారు, పి. సుందరావుగారు, మరియు పాల్ గూటంగారు పై అంశముపై చక్కని సందేశమును అందించిరి.

క్రీస్తు నామము విశిష్టమైనది, ఔన్నత్యముగలది. క్రీస్తు నామము ప్రతి నామమునకు పై నామము (ఫిలిప్పీ 2 : 11). విధేయులైనవారి కొరకు తండ్రియింట సిద్ధపరచిన నిత్య నివాసమునకు కొని పోవు నామము. చీకటిలో నున్న మానవులకు ఆశ్చర్యకరమైన వెలుగును చూపగలిగిన ఏకైక నామము. ఆయన సంఘము మహిమగల సంఘముగ తన ఎదుట నిలువబెట్టుకొనవలెనని దానికొరకు (సంఘము కొరకు) తన్ను తాను అప్పగించుకొనిన యేసుక్రీస్తు నామమును సంఘము ధరించవలసి యున్నది. మనలను తండ్రియొద్దకు తీసుకొని వెళ్ళు నామమది. క్రీస్తు ఆత్మ సంబంధమైన రాజు, ఆయన రాజ్యము అంతములేనిది, సమస్త జనులు ఆత్మ ఫలములను ఫలించునట్లు సర్వ మానవాళికి శ్రేష్టమైన నిబంధన నొసంగిన సమాధానకర్తయగు అధిపతి (**Prince of Peace**) క్రీస్తే. క్రీస్తు రాజ్యనివాసులైన మనము బాప్తిస్మమిచ్చు యోహానుకంటె గొప్పవారము (మత్తయి 11 : 11).

[See Title 3rd Page

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 ఏప్రియల్ 1994 సంచిక 9


## సంపాదకీయము

### తప్పిపోయిన దెవరు ?

### ( Who is Lost ? )

మనము ఏ రకమైన ప్రపంచములో నివసించుచున్నాము? అది మంచిదా, చెడ్డదా? మీకు తెలిసిన ప్రజలు యెట్టివారు? మీ స్నేహితు లెట్టివారు ? మీతో కలిసి పనిచేయు వారెట్టి వారు? మీచుట్టు ప్రక్కల నివసించువారెట్టివారు? నీవు వారిని యేవిధముగా వర్గీకరింతువు ? బహుశ నీవు యిట్టువంటి విషయములను గూర్చి యెప్పుడూ ఆలోచించి యుండక పోవచ్చు. అట్లు ఆలోచించి యుండినచో మీరు ఒక విధముగా కలత చెంది యుందురు. అయితే మిమ్మును గూర్చిన విషయమేమిటి? మీ రెట్టివారు? ఈ ప్రపంచములోని వారందరు మీ లాంటి వ్యక్తులే అయి యుంటే ఈ ప్రపంచము యింతకంటే మంచి స్థితిలో యుండెడిదా లేక యింకను హీనస్థితికి పోయెడిదా ?

ఈ ప్రపంచమంతటిలోను అనేక రకములైన వ్యక్తులున్నారు. భక్తి గలవారు, భక్తి లేనివారు, నీతి గలవారు, దుర్మార్గులు గలరు. బైబిలు ఈ విధముగ చెప్పుచున్నది. లోకమంతయు దుష్టుని యందున్నదని మన మెరుగుదుము (1 యోహాను 5:19). అపొస్తలుడైన పౌలు ఈ విధముగ చెప్పుచున్నాడు. ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). అనగా అందరూ పాపులే యనియు వారు ఈలోకములోనేగాక రాబోయే లోకమునకు కూడా తప్పిపోయి, నిరీక్షణ లేనివారై యున్నారనియు తెలియుచున్నది. ఈ ప్రపంచములో యున్నవారిలో యెక్కువ మంది నిరీక్షణ లేని దుస్థితిలో యుండుట యెంతో విచారకరము.

తమ పాపముల వలన తప్పిపోయి దేవుడు లేకను, నిరీక్షణ లేకను యున్నారని చాల మంది తలంచరు. వారు ఆ విషయమును గూర్చి గ్రహింపు కలిగియుండక పోయినప్పటికిని వారట్టి దుస్థితిలోనే యున్నారని చెప్పక తప్పదు. అట్లు తప్పిపోయిన వారెవరో, వారు వారి యొక్క జీవిత విధానమును మార్చుకొనునట్లు మన మెట్లు సహాయము చేయగలమో ఆలోచించుదము.

ప్రపంచ మంతయు పాపముతో చీకటిచే, దుర్మార్గముతో నిండియుండినప్పటికిని అందరూ రక్షణలేనివారు, తప్పిపోయిన వారు కారని ముందుగా తెలియజేయవలెను. ఉదాహరణగ ఒక శిశువు ఈ లోకములో పుట్టినపుడు ఆ శిశువు మంచి చెడ్డలను గ్రహించుకొను వయసు వచ్చువరకు పాపము లేకుండనే యుండును. అందుకే ప్రభువైన యేసు ఈవిధముగా చెప్పుచున్నారు. "మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనేగాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. కాగా ఈ బిడ్డవలె తన్ను

తాను తగ్గించుకొను వాడెవడో వాడే పరలోక రాజ్యములో గొప్పవాడు. మరియు ఈలాటి యొక బిడ్డను నా పేరిట చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును (మత్తయి 18 : 4-5). మరియు అట్టి అమాయకపు స్థితిలో ఒక శిశువు మరణించినచో ఆశిశువు పరలోక రాజ్యములో ప్రవేశించును. అయితే ఆ బిడ్డ పెరిగి మంచి చెడ్డల తారతమ్యమును గ్రహించుకొనే స్థితికి చేరుసరికి తన క్రియలను బట్టి లెక్క అప్పగించవలసి యుండును గనుక పాపిగనే పరిగణింపబడును.

మంచి, చెడుగులను గ్రహించగలిగే వయస్సు వచ్చిన పిమ్మట ఒకరు దేవుని చిత్తమును తెలుసుకొనుటకు వాక్యమును పఠనము చేసిన, లేక యేసుక్రీస్తు సువార్తను వినినను, దేవుని ఆజ్ఞలకు విధేయులైనను ఆవ్యక్తిని దేవుడు రక్షించును. యేసు ప్రభువు ఆయన అపొస్తలులతో, "మీరు సర్వలోకమునకు వెళ్లి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" అని చెప్పెను (మార్కు 16 : 15-16). రక్షింపబడిన వ్యక్తి దేవుని యెడల విశ్వాసముతో జీవించినంతకాలము ఆవ్యక్తి రక్షింపబడిన స్థితిలో యుండును. ప్రభువైన యేసు ఈ మాటలు చెప్పుచున్నారు. "మరణమువరకు నమ్మకముగా యుండుము, నేను నీకు జీవకిరీట మిచ్చెదను" (ప్రకటన 2 : 10).

తప్పిపోయిన వారి విషయము ఆలోచించుదము. మంచి చెడుగులను గ్రహించగల వయస్సు వచ్చిన పిమ్మట తప్పిపోయిన వ్యక్తి పాపిగ పరిగణింపబడును. అయితే దేవుని చిత్తమును ఎరుగని వారి యొక్కయు, ఎన్నడును సువార్త వినని వాని యొక్కయు పరిస్థితి యేమిటి? తెలియక పోవుట యనేది ఒక సాకుగా చెప్పిన దానిని ప్రభువు అంగీకరించరు. ప్రభువైన యేసు తన ప్రభావము కనుబరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై,

దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునపుడు మిమ్మును శ్రమపరచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే (2 థెస్స 1 : 7-9) అని అపొస్తలుడైన పౌలు హెచ్చరించుచున్నాడు. దేవునిని తెలుసుకొనకుండ కాలము వ్యర్థాచేసి న్యాయపు తీర్పు దినమున దేవుని చిత్తము తెలియదని తీర్పునుండి తప్పించుమని బ్రతిమలాడినను, నిత్యజీవము లోనికి ప్రవేశించ నాశించినను అట్టివ్యక్తి పరలోకములో ప్రవేశించడు.

నీతితో కూడిన మంచి జీవితము జీవించువారు కూడ తమ నీతి క్రియలద్వారాగాని, వారి మంచి జీవితము ద్వారాగాని రక్షించబడుదుమని తలంచినచో వారుకూడ నాశనమునకు పోవువారిలో యుందురు. కొర్నేలీయు అతని యింటివారును ప్రజలకు బహు ధర్మము చేయుచు దేవునికి ప్రార్థనలు చేయుచుండిరి (అపొ. కా. 10, 11 అధ్యా). అయినప్పటికిని వారు రక్షింపబడునట్లును సువార్తను విని దానికి లోబడవలసి యున్నది. అయితే మంచి పనులు, ధర్మ కార్యములు మున్నగునవి చేయుట ద్వారా రక్షణ కలుగదు. పౌలు ఎఫెసు వారికి యిట్లు వ్రాయుచున్నాడు. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. (ఎఫెసి 2 : 8-9). అతడు తీతుకు యిట్లు వ్రాయుచున్నాడు. "మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను (తీతు 3 : 5). ఒక వ్యక్తి ఎంతో నీతి గలిగిన మంచి జీవితము జీవించుచు, సత్ క్రియలు చేయుచున్నపుడు అతడెట్లు పాపి

యగును ? ఏలాగు తప్పిపోయిన వాడగును ? మన మంచి తనమును బట్టికాక క్రీస్తు ప్రభువు కృపచేతనే రక్షింపబడితిమి. మానవుడు రక్షింపబడుటకును, పరలోక రాజ్యములో ప్రవేశించుటకును తనను తాను నమ్ముకొనుటగాని, తనయొక్క మంచి క్రియలతో కూడిన జీవితమును బట్టిగాని జరుగదు. అతడు ఎంత మంచి వాడైనప్పటికిని అతని మంచి తనమతనిని రక్షింపనేరదు. ఒక్క చిన్న పొరబాటు కూడ లేనట్టి పవిత్రమైన, పరిశుద్ధమైన జీవితము జీవించుట బహు కష్టము. అతడు మానవత్వము గలవాడు, శరీరసంబంధి, అతడు తప్పి దములు, పొరబాట్లు చేయును. కాబట్టి అతడు పాపి. రక్షించబడునట్లు అతడు క్రీస్తు ప్రభువు నొద్దకు రావలెను. ఒక వ్యక్తి తనమంచి క్రియల ద్వారా తనను తాను రక్షించుకొనగల సమర్థత కలిగి యుండిన, ఆ ప్రకారమే అందరూ మంచిగ యుండిన, మనందరి పాపములకొరకు ప్రభువైన యేసు బలి కావలసిన అవసరముండదు. అయితే క్రీస్తు రక్తములో కడుగబడిననేగాని యే మానవుడు రక్షణ పొందలేడు.

భక్తి గలిగిన వారు కూడ నాశనమునకు పోవుదురు. దైవభక్తి గలవారమని చెప్పుకునే వారు మాత్రమే కాదుగాని యేసు ప్రభువు నందు విశ్వాసముంచి ఆయనను వెంబడించుచున్నామని చెప్పుకునే వారు కూడ నాశనమునకు పోవుదురు. వీరిలో చాలమంది క్రీస్తు బోధల ననుసరించుట మాని, మానవుల పద్ధతులను బోధలను అనుస రింతురు. అట్టి వారిని గూర్చి ప్రభువైన యేసు ఈ విధముగా చెప్పు చున్నారు. "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21-23). అపొస్తలుడైన పౌలుయొక్క మాటలు వినండి. "సహో దరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను,

ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టి యుండుమని మిమ్మును బతి మాలుకొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటలవలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17-18). కాబట్టి మీరు భక్తి గలిగిన వారమని తలంచినంత మాత్రమున రక్షణ పొందలేరు. మీరు ఒక వ్యక్తిని లేక అతని సిద్ధాంతములను అనుసరించుచుండవచ్చు. మీరు క్రీస్తు నామము ధరించని వేరే యితరమైన సంఘములోని సభ్యులు కావచ్చు. మానవులు కల్పించిన సిద్ధాంతములు, ఆజ్ఞల ప్రకారము మీరు ఆరాధించుచుండవచ్చు. చివరిగా మీరు ఎంతో భక్తి గలిగిన వారుగా యుండవచ్చు. అయితే మీరు దేవునికి హృదయపూర్వక మైన విధేయత కలిగియుండి ఆయన సంఘములో సభ్యులు కానిచో మీరు తప్పిపోయినవారే. మీ భక్తి యెట్టిదై యున్నదీ ఒకసారి మిమ్మును మీరు పరీక్షించుకొనవలసినదని మిమ్మును హెచ్చరించు చున్నాను. మోసగింపబడుట, తప్పుదారికి మళ్ళింపబడుట మిక్కిలి తేలికైన విషయము. దాని అంతము నిత్యనాశనమే. అది మీకు సంభవింపకుండ జాగ్రత్త పడుడి.

ఇహలోక సంబంధ జీవితము జీవించువారు అపనమ్మకస్థులుగ, చెడు కార్యములు చేయువారిగ యుందురు. వారు తప్పిపోయినవారు. వారు మానవ చట్టమును, దైవాజ్ఞలను కూడ ఉల్లంఘించినవారు. వారు ఇహలోక సంబంధమైన కారాగారములలో యున్నారు. వారిలో చాలమంది మనచుట్టూ ఉంటూ వారు రాజకీయములలోను, వ్యాపా రములోను, తదితర పనులలోను యుంటున్నారు. మరి కొంతమంది వీధుల వెంబడి తిరుగుచూ యుందురు. వీరు శరీర సంబంధమైన క్రియ లలో పాలొనుచున్నవారు. శరీర కార్యములు స్పష్టమై యున్నవి;

అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆట పాటలు మొదలైనవని (గలతి 5 : 19-21). అయితే వీటి ఫలితమును వారు ఈలోకమందైనను, రాబోవు కాలమందైనను, లేక రెండింటి యందును కూడ అనుభవించవలసి వచ్చును. పాపము వలన వచ్చు జీతము మరణము అని పౌలు చెప్పుచున్నాడు (రోమా 6:23). చెడు కార్యములు చేయువారిని ప్రభువైన యేసు ఈ విధముగ హెచ్చరించుచున్నారు. "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో యున్న వారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడుచేసిన వారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28-29). ప్రభువును, ఆయన ప్రజలను మీ పాపముల విషయమై పశ్చాత్తాపపడుమని మిమ్మును హెచ్చరించుచున్నారు. మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురు (లూకా 13 : 3). మీరు రక్షింపబడునట్లు దేవునికి విధేయులుగ యుండుడి. ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణ సిద్ధి పొందినవాడై, మెల్కీసెదకు యొక్క క్రమములో చేరిన ప్రధాన యాజకుడని దేవునిచేత పిలువబడి, తనకు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:8-10). స్నేహితులారా, మిమ్మును రక్షించుట కొరకే క్రీస్తు ప్రభువు ఈ లోకములోనికి వచ్చెను. మీరు రక్షింపబడునట్లు మీ కొరకు ఆయన మరణించెను. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మదగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనది

యున్నై యున్నది (1 తిమోతి 1:15). దేవునిని, ఆయన అనుగ్రహించు రక్షణను మీరు త్రోసివుచ్చకండి. జీవ వృక్షమునకు హక్కుగల వారై గుమ్మముగుండా ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు (ప్రకటన 22:14).

ఇహలోక సంబంధమైన కార్యములకు లోనై పాపమునకు దాసులై దేవునికి విధేయులుగా మారిన దేవుని బిడ్డలైన వారుకూడ నిత్యనాశనమునకు పోవుదురు. తప్పిపోయిన కుమారుడు తండ్రితో యుండికూడ తరువాత తన ఆస్తినంతటిని దుర్వ్యాపారము వలన పాడు చేసికొని తిరుగుబాటు జీవితములోనికి పోయిన కథను క్రీస్తు ప్రభువు చెప్పెను (లూకా 15 : 11-32). అయితే ఆ కుమారుడు తన తప్పిదమును గ్రహించి తిరిగి వచ్చినట్లు వ్రాయబడినది. క్రీస్తుప్రభువును విడిచి పెట్టిన వారిని గూర్చి పేతురిట్లు వ్రాయుచున్నాడు. "వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానము చేత ఈ లోక మాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటిచేత జయింపబడిన యెడల, వారి కడవరి స్థితి మొదటి స్థితి కంటె మరి చెడ్డదగును. వారు నీతి మార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుట కంటె ఆ మార్గము అనుభవపూర్వకముగా తెలియక యుండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగినట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను (2 పేతురు 2 : 20-22). నీవు క్రైస్తవుడవును, దేవుని సంఘ సభ్యుడవును అయినందుచేత రక్షింపబడితినని, నాశనమునకు పోనని తలంచవద్దు. నీవు నిజమైన, నమ్మకమైన క్రైస్తవుడవుగా యుండిననే గాని క్రైస్తవ జీవితము జీవించలేవు. నీవు మరణించిన పిమ్మట పరలోకరాజ్యములో ప్రవేశింపలేవు.

ఇదిగో మీరు శోధింపబడునట్లు అపవాది మీలో కొందరిని చెరలో వేయింపబోవు చున్నాడు; పది దినములు శ్రమ కలుగును, మరణము వరకు నమ్మకముగా నుండుము. నేను నీకు జీవకిరీట మిచ్చెదను (ప్రకటన 2:10). మీరు రక్షింపబడునట్లును, రక్షణలో నిలిచియుండి జీవించినట్లును, మీ జీవితకాలము దేవుడైన ప్రభువుకు విధేయులై ఆయనను మాత్రమే సేవించునట్లును మీకొరకు ప్రార్థన చేయుదును.

ఈ యుగసంబంధమైన మనుష్యులు పాపమందును, చీకటి యందును, దుర్మార్గతయందును యుండినవారు. వారినిగూర్చి ఎన్న నదగిన మంచి యేమియు యుండదు. అట్టివారిని గూర్చి ప్రభువైన యేసు ఇట్లు చెప్పెను : "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది. దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది. దానిని కనుగొనువారు కొందరే" (మత్తయి 7 : 13-14). ఏ భేదమును లేదు. నేను, మీరు పాపులమే. దేవునికి విధేయులమై యుండుటను బట్టి మనము రక్షణ పొందుట లేక నాశనమునకు పోవుట యుండును. మీరు దేవునికి విధేయులు కానిచో మీరు ఆయనకు విధేయులగు వరకు నశించిపోవు స్థితిలోనే యుందురు. మీరు నిత్యమూ నశించిపోయే స్థితిలోనే యుండ నవుసరములేదు. మీ యెడల దేవుని చిత్తమును వినుడి, ఆయనయందు విశ్వాస ముంచుడి, మీ పాపములనుండి మరలు కొనండి, మనుష్యుల యెదుట యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనండి, ఆయన మిమ్మును రక్షించునట్లు బాప్తిస్మము పొందండి. మీరు అవిశ్వాసులైన క్రైస్తవు లయినట్లయిన మీరు కూడ నశింపబడిన వారే. మీరు దయచేసి మీ పాపముల విషయమై పశ్చాత్తాప పడండి. మీ పాపములనుండి పరిహారము పొంది రక్షణ కలుగునట్లు ప్రభువును, మీ

తోటి సహోదరులను క్షమాపణ కోరండి. ఎవరును నశించిపోయే స్థితిలో యుండరు, ఉండకూడదు. మనకు రక్షణ కలుగునట్లు క్రీస్తు మనకొరకు మృతి బొందెను. ఆయన మన కనుగ్రహించుచున్న రక్షణను అంగీకరించుదము. మనకు సమయము; తరుణము ఉండినపుడే ఆ గొప్ప రక్షణను చేపట్టుదము.

---

## ఎవరికి మంద్ధ దృష్టి ?

## (Who hath the Redness of Eyes ?)

నేటి నాగరిక ప్రపంచములో మత్తుపానీయముల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. మత్తు పానీయములు సేవించడం నాగరికతకు లక్షణంగా ఎంచబడుతోంది. త్రాగనివాడు సంస్కృతి నెరుగని వాడుగా నిందింపబడుచున్నాడు. అసంఖ్యాకులైన వారు వ్యవహరించి ఒక పని చేయుటవలన, అది మంచిదే అని నిర్ణయింప వచ్చునా? సద్విషయములకు లోబడువారు బహు కొద్ది మందియేనని సామాన్యముగా చెప్పవచ్చును. మత్తు పానీయములకు వశులైపోయిన వారి విషయములో సర్వే చేసిన మానసిక వేత్తలు, వైద్య విజ్ఞానులు, వేదాంత వేత్తలు, సమాజ శాస్త్రజ్ఞులు యేమి ఉపదేశించుచున్నారో విందమా?

### I త్రాగుబోతులు ఎలా అవుతారు ?

a. ఆసక్తి కొద్దిగాని, మిత్రుల బలవంతంపై గాని మద్యపానం సేవించుట ప్రారంభిస్తారు. వారు పూర్తి త్రాగుబోతులుగా మారటానికి అనేక దశలు అధిగమించుతారు. వారు ప్రతిరోజు కొద్ది కొద్దిగా మద్యం తీసుకోవడం ప్రారంభిస్తారు. త్రాగిన ప్రతిసారి క్రితం సారి కంటె ఎంతో కొంత ఎక్కువ తీసుకొంటారు. వారి కది అంతే ఎక్కువగా కనబడక పోవచ్చును. గాని పదిసార్లు క్రితం తీసుకొన్న

దానికి ఇప్పుడు తాగిన దానికి చాల తేడా ఉంటుంది. ఇది అధికంగా ఉన్నట్లయితే వారు మొదటి దశను దాటుతున్నట్లు నిర్ణయింప వచ్చును.

**b** తాగిన మైకంలో రకరకాల చేష్టలు చేస్తుంటారు. విపరీతంగా ప్రవర్తిస్తారు. క్రితం రాత్రి అలా ప్రవర్తించినందుకు మరుసటి రోజు పశ్చాత్తాపపడటం, అపరాధం చేసినట్లు, అవమానకరంగా ప్రవర్తించినట్లు భావించడం జరిగితే వారు రెండవ దశను పూర్తి చేసినట్లు నిర్ణయింపవచ్చును. వారు మద్యానికి బాగుగా అలవాటు పడినట్లు గ్రహింపగలము.

**c.** తాను తాగిన మైకంలో ఏమి చేసింది, తాను పూర్తి నిషాలో ఇంటికి ఎలా రాగలిగింది తెల్లవారిన తరువాత పూర్తిగా మరచిపోవడం జరిగితే ఎంతగా ప్రయత్నించినా జ్ఞాపకం రాకపోతే మూడవ దశను దాటినట్లు నిర్ణయింపవచ్చును, వారు మితి మీరి మద్యాన్ని సేవిస్తున్నట్లు తెలిసికోగలం.

**d.** ఇక ఉదయం నిద్రలేచిన తరువాత కాఫీ బదులు మద్యం సేవించడం ప్రారంభిస్తే, ఈ అలవాటు అతని అదుపు తప్పిపోయిందని, పూర్తి తాగుబోతుగా మారాడని నిర్ణయింపవచ్చును. రాత్రి త్రాగినప్పటి మైకపు ఛాయలు వదలకగాని, ఈ రోజంతా హాయిగా గడపాలని గాని వారు పరగడుపున తాగటం ప్రారంభిస్తారు. అట్టివారు నాల్గవ దశను దాటారని అనుకొనవచ్చును.

**e.** ఇక అయిదవ దశలో వారు నేలపై బడి దొర్లటం ప్రారంభిస్తారు. భార్యగాని, మిత్రులుగాని మద్యపానాన్ని తీవ్రంగా నిరసించక, ప్రోత్సహించడం జరిగితే ఈ వివిధ దశలన్నీ అధిగమించి అయిదవ దశకు తేలికగా చేరుకోవడం సుగమ మౌతుంది.

**(Repu-Psychology monthly, Vol 3, No : 12, Page 15).**

## II రక్తంలో ఆల్కాహాలు శాతము - ఫలితములు

| | |
|---|---|
| 0.01% | మెదడు స్థిమితంగా ఉండును. |
| 0.02% | ఒడలు తిమ్మిరి |
| 0.03% | మత్తెక్కును |
| 0.05% | తనలో తాను నవ్వుకొనును |
| 0.07% | తన, యితరుల రహస్యములను బైట పెట్టును |
| 0.09% | ఎక్కడ బడితే అక్కడ పడిపోవును |
| 1% | ఇతరుల సహాయము లేనిదే లేవలేడు |
| 2% | స్పృహ కోల్పోతాడు |
| 3% | శ్వాస కష్టంగా పీలుస్తాడు |
| 4% | మరణించే అవకాశముంది |
| 5% | చనిపోవడం జరుగుతుంది |

జాతీయ ఆరోగ్య సమస్యలలో యిది మూడవది. త్రాగుడు వలన మెదడులోని కణజాలము పాడై మతి భ్రమణం సంభవిస్తాది. అన్ని మత్తు పానీయములలో కలిసేటటువంటి **(ingredient)** ఇథైల్ ఆల్కాహాలు శరీరమందలి కణములను, భాగములను నాశనం చేస్తుంది. దీని వలన హృదోగ్రము, కేన్సరు వంటి కుదరని రోగములు వస్తాయి. కడుపులోని వృక్వకము **(Pancreas)** దెబ్బతిని భయంకరమైన చావు చావవలసి వస్తుంది. అందువలననే సామెతల గ్రంథకర్త యిట్లు చెప్పుచున్నాడు : "ద్రాక్షారసము వెక్కిరింతల పాలు చేయును, మద్యము అల్లరి పుట్టించును, దాని వశులైన వారందరు జ్ఞానము లేనివారు" (సామెతలు 20 : 1).

## III బైబిలు ఏమి బోధించుచున్నది ?

a. నోవహు త్రాగి అసభ్యంగా ప్రవర్తించాడు ఆది 9:20-26.

b. లోతు త్రాగుట వలన తన స్వంత కుమార్తెలతో వ్యభిచరించాడు. ఆది 19:30-38.

c. నాబాలు గుండె పగిలి చనిపోయాడు. 1 సమూ 25:23-38.

d. అమ్నోను త్రాగియుండగా అబ్షాలోము వలన చంపబడ్డాడు. II సమూ 13:28-29.

e. ఏలా అను రాజు త్రాగి మత్తుడై యుండంగా అధికారియైన జిమ్రీ అతని కొట్టి చంపి అతనికి మారుగా రాజాయెను.
1 రాజులు 16:8-10.

f. బెన్హదదు అతని సహకారులైన ముప్పది యిద్దరు రాజులు గుడారములలో త్రాగి మత్తులై యుండగా బహు కొద్ది మంది ఇశ్రాయేలీయులచే చంపబడిరి. 1 రాజులు 20:13, 21.

g. మద్యము కుటుంబములను కూలగొట్టును. రాజైన అహష్వేరోషు త్రాగిన మైకంలో తన భార్య తన మాటకు మన్నన చూపలేదని, త్రాగుబోతుల మాట విని ఆమెను వదిలేసాడు. ఎస్తేరు 1:5-22.

h. త్రాగుబోతులు దేవునిగూర్చి గాని, యితరుల క్షేమమునుగూర్చి గాని పట్టించుకోరు. ఆమోసు 6:6.

i. సుడిగాలి వచ్చుచున్నను యోబు పిల్లలు ద్రాక్షారసము పానము చేయుచుండిరి. యోబు 1:18, 19.

j. ద్రాక్షారసమును వాంఛించువాడు దరిద్రుడగును.
సామె 21:17; 23:21.

k. అది అభద్రతా భావము కలిగించును.

మద్యము త్రాగుదమని వేకువనే లేచి ద్రాక్షారసము తమకు మంటపుట్టించువరకు చాల రాత్రి వరకు పానముచేయు వారికి శ్రమ

(యెషయా 5:11). ద్రాక్షారసము వలన తూలి తిరుగులాడుదురు. మద్యము వలన తత్తర పడుదురు (యెషయా 28:7). ద్రాక్షారసము పానము చేయుటచేతను మద్యపానము చేతను వారు మతి చెడిరి (హోషేయ 4 : 11). త్రాగుబోతులు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు (1 కొరింథీ 6:10; గలతీ 5:21).

ప్రభురాత్రి భోజనములో ద్రాక్ష సారాయికి (Wine) తావు లేదు. ద్రాక్షారసము (Fruit of the Vine) మాత్రమే వాడవలెను (1 కొరింథీ 11:25).

## IV దురభిప్రాయాలు వదలించుకోండి !

1. మద్యం మనస్సుకు ఉత్తేజం, ఉద్దీపన కలిగిస్తుందను కొంటారు. ఇది పొరపాటు అది మనస్సును మందగింప జేస్తుంది.

2. కొన్ని కొన్ని వ్యాధుల చికిత్సకై మద్యాన్ని సేవించమని డాక్టర్లు సూచిస్తున్నట్లు కొందరు చెబుతారు. ఇది పూర్తిగా అబద్ధం. ఏ చికిత్సలోను ఏ డాక్టరు మద్యాన్ని సేవించవలసిందిగా సలహా ఇవ్వడు.

3. దృఢ చిత్తం ఉన్న వ్యక్తులు ఎన్నిసార్లు మద్యం సేవించినా ఈ అలవాటుకు బానిసలు కారనుకోటం పూర్తిగా తప్పు.

4. మితిమీరి త్రాగేవారు ఆయా దుష్ఫలితాలను గమనించి తమ త్రాగుడు పరిమితం చేసుకోగలరనుకోడం తప్పు.

(Repu Vol 3, No : 12, P. 13)

## V సమాజ శాస్త్రజ్ఞుల సర్వే ప్రకారం :

1979 లో అమెరికా దేశమందలి మిషిగన్ నందు ఆత్మహత్య చేసికొన్న వారిలో 33% మంది మద్యపానమునకు అలవాటు పడిన వారే. ఖూనీ కేసులలో ప్రమేయం ఉన్న వ్యక్తులు 64% మంది మద్యపానానికి లోనైనవారే. పోలీసుల వలన అరెస్టు కాబడుతున్న

వారిలో 55% వ్యక్తులు మద్యపానానికి అలవాటు పడినవారే. విడాకులు పొందుచున్న 20% కేసులు మద్యపానముల ప్రభావమే. హాస్పిటలు పాలగుచున్న 40% వీరే.

అట్లనే, బెంగుళూరులో ఆత్మహత్య చేసికొన్న వారిలో 70% బొంబాయిలో హత్య కేసులలో సంబంధమున్న వ్యక్తులు 70% కంటే ఎక్కువ. పోలీసులు అరెస్టు చేయుచున్న ప్రతి ముగ్గురిలో ఒకరు మత్తుపానీయములకు అలవాటు పడినవారు. మద్యపానీయముల ప్రభావం ఎంత దారుణంగా ఉందో గమనించండి.

ఇంకను మన వినికిడిలో యున్న అనేక ప్రమాదములు, సమస్యలు, కల్లోలములు, కొట్లాటలు ఈ మద్యపానీయముల పర్యవసానమేనని మనకు తెలియును. మత్తు పదార్థములకు అలవాటు పడిన యజమానులు, వారి కుటుంబములను సరిగా పట్టించుకొనకపోవుట వలన వారి దురవస్థలు, మనము కళ్లార చూచుచున్నవే. "ఆహారము కాని దాని కొరకు మీరేల రూకలిచ్చెదరు? సంతుష్టి కలుగజేయని దానికొరకు మీ కష్టార్జితమును ఎందుకు వ్యయపరచెదరు? నా మాట జాగ్రత్తగా ఆలకించి మంచి పదార్థమును భుజించుడి. మీ ప్రాణము సారమైన దానియందు సుఖింపనియ్యుడి" (యెషయా 55 : 2).

## VI మరికొన్ని దృష్టాంతములు :

1. థామస్ జెఫర్‌సన్ అను అమెరికా దేశస్థుడొకడు ఇట్లు చెప్పాడు: "త్రాగుబోతుల యిండ్లకు కిటికీలుండవు, తోటలకు కంచెలుండవు, పొలములు దున్ని ఉండవు, పిల్లలకు బట్టలుండవు, వారికి మంచి మర్యాదలు తెలియవు."

2. "నాగుబామును ఎట్లయితే దగ్గరకు చేరనీయమో అట్లనే మద్యమును దగ్గరకు రానీయ కూడదు."

3. "ఒక మనుష్యుడు చిన్న కప్పుతో మద్యమును సేవించినట్లయితే, ఆ మద్యము మరొక కప్పును త్రాగిస్తాది, చివరకు ఆ మద్యము ఆ మనుష్యునే తీసికొంటాది" అనే జపాను సామెత కలదు.

4. ఒకవ్యక్తి ఒక సీసాను తీసుకెళ్ళి దానిలో సారా పోయమన్నాడు. అది త్రాగిన తరువాత, తన మోటారు సైకిలు తీసుకొని పెట్రోలు బంకు దగ్గరకుపోయి, పెట్రోలుతో టాంకును నింపమన్నాడు. ఆ తరువాత త్రాగిన మత్తులో మోటారు సైకిలును నడుపుతు, కంట్రోలు చేయలేక ఒక ఎలక్ట్రిక్ స్థంభమునకు ఢీకొని చని పోయాడు.

సారాతో సీసాను నింపమన్నాడు, పెట్రోలుతో మోటారు టాంకును నింపమన్నాడు. ఇప్పుడైతే మన్నుతో అతని సమాధిని నింపు చున్నారు. ఈ మరణము ఎవరు తెచ్చుకొన్నారు?

"ఎవరికి శ్రమ? ఎవరికి దుఃఖము? ఎవరికి జగడములు? ఎవరికి చింత? ఎవరికి హేతువులేని గాయములు? ఎవరికి మంద దృష్టి? ద్రాక్షారసముతో పొద్దు పుచ్చు వారికే గదా! కలిపిన ద్రాక్షా రసము రుచి చూడ చేరువారికే గదా! ద్రాక్షారసము మిక్కిలి ఎఱ్ఱ బడగను, గిన్నెలో తళతళలాడు చుండగను, త్రాగుటకు రుచిగా నుండగను దానివైపు చూడకుము. పిమ్మట అది సర్పము వలె కాటు వేయును" (సామె 23 : 29-32).

ఇంత ఘోరముగా శరీరమును, మనస్సును, ఆత్మను దోచు కొనుచున్న ఆల్కహాలు **(The term "Alcohol" comes from two Arabic words which mean the "great evil spirit"** అను దుష్ట శక్తిని ఎదుర్కొనలేవా? మరి ముఖ్యముగా నీవు క్రైస్త వుడవైనట్లైతే మత్తు పదార్ధముల జోలికి పోవుట శ్రేయస్కరముగాదు.

—**K.S.P.** పాత విద్యార్థి.

—o—

కొండమీద ప్రసంగము - 1

## దుఃఖపడువారు ధన్యులు

## ( Blessed are they that Mourn )

(మత్తయి 5 : 4)

యేసుప్రభువు కొండమీదనుండి చేసిన ప్రఖ్యాతి గాంచిన ప్రసంగములో "దుఃఖపడువారు ధన్యులు. వారు ఓదార్చబడుదురు" అని చెప్పారు (మత్త 5 : 4). ఈ మాట లోక తీరుకు భిన్నముగా యున్నది. దుఃఖములో యున్నవారు నిజముగా ధన్యులని, దీవించబడిన వారని మనం సాధారణంగా తలంచము. నేడు ప్రజలు చేయునదంతా దుఃఖమునుండి కన్నీళ్ళనుండి పారిపోవుట చేయుచున్నారు. వారు విలాసాలను వినోదాలను ఎక్కువ వెదుకుచున్నారు.

దుఃఖము, ఏడ్పు ఈ రెండు పర్యాయపదాలే. "ఇప్పుడు ఏడ్చుచున్న మీరు ధన్యులు, మీరు నవ్వుదురు" అని యేసుప్రభువు యొక్క మాటలను లూకా వ్రాసాడు (లూకా 6:21). దుఃఖించుట, ఏడ్చుట అంటే వినబడేలాగున ఏడ్చుట, కన్నీళ్లు కార్చుట, పిల్లలవలె ఏడ్చుటయని దీని భావం. ఏలయనగా "దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును. ఈ మారుమనస్సు పశ్చాత్తాపమును పుట్టించదు. అయితే లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును" (2 కొరింథీ 7:10). ప్రభువును ఎరుగనని బొంకిన తరువాత పేతురు "ప్రభువు తనతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొని వెలుపలికి పోయి సంతాపపడి యేడ్చెను" (లూకా 22:62). "దుఃఖపడినవారమై నట్టేయుండియు ఎల్లప్పుడు సంతోషించువారము" అని పౌలు 2 కొరింథీ 7 : 10లో చెప్పాడు. "యెహోవా హితవత్సరమును మన దేవుని ప్రతిదండన దినమును ప్రకటించుటకును, దుఃఖాక్రాంతుల నందరిని ఓదార్చుటకును" యేసుక్రీస్తు పంపబడెనని

యెషయా ప్రవచించాడు (యెషయా 61:1-2). "సాయంకాలమున ఏడ్పు వచ్చి రాత్రి యుండినను ఉదయమున సంతోషము కలుగును" అని దావీదు వ్రాసాడు (కీర్తన 30:5).

ఒక మనుష్యుని దుఃఖపరచునదేదో, సంతోషపెట్టునదేదో మనకు తెలిస్తే అతని ప్రవర్తన ఎట్టిదో మనం చెప్పవచ్చు. మనం దేనిని గూర్చి నవ్వుతామో, దేనిని గూర్చి ఏడుస్తామో దానిని బట్టి ఏయే విషయాలకు మనం విలువనిస్తామో తెలుస్తాది. పెద్దవారికి తీవ్రముగా కనబడువాటిని గూర్చి చిన్నపిల్లలు నవ్వుతారు. పెద్దలకు సూక్ష్మంగా కనబడువాటి విషయమై చిన్నపిల్లలు ఏడుస్తారు.

మనం ఆనందాన్ని అనుభవించడానికి ఎప్పుడు మొదలు పెడతామో, అప్పుడే దుఃఖానికి కూడ పాత్రులమయ్యే అవకాశం వున్నది. యౌవ్వన దంపతులు వివాహమాడినప్పుడు ఎంతో సంతోషంగా యుంటారు. అయితే కొన్నాళ్లకు వారిద్దరిలో ఎవరో ఒకరు తీవ్రమైన రోగానికి గురియైతే చాల దుఃఖిస్తారు. అలాగే మనకు బిడ్డలు కలిగినప్పుడు పట్టరాని ఆనందం కలుగుతాది. వారికేమైనా సంభవిస్తే పట్టరాని దుఃఖము కలుగుతాది. ఈ లోకంలో మనకు సంతోషం కలిగించే ప్రతీది దుఃఖాన్ని కూడ కలిగించగలదు. జీవితం నుండి పారిపోవడమే దుఃఖాన్ని తప్పించుకోవడమని చాలమంది తలుస్తారు. 55వ దావీదు కీర్తనలో దావీదు తన దుఃఖాన్ని సంతాపాన్ని నిరుత్సాహాన్ని ఎంతో లోతుగా వర్ణిస్తాడు. "ఆహా గువ్వవలె నాకు రెక్కలున్న యెడల నేను ఎగిరిపోయి నెమ్మదిగా నుందును. త్వరపడి దూరముగా పారిపోయి, పెనుగాలిని సుడిగాలిని తప్పించుకొని అరణ్యములో నివసించి యుందునే అనుకొంటిని" అని అతడు చెప్పాడు (కీర్త 55:6-8). జీవితంలో నిరుత్సాహాన్ని నిస్పృహను ఎదుర్కొన్నప్పుడు

మానవులు దావీదువలె తలంచడం సహజం. నిజంగా దుఃఖంనుంచి ఎగిరిపోడానికి మనకు రెక్కలుంటే ఎంతబాగుండును!

అయితే దుఃఖపడువారు ధన్యులు. వారు ఓదార్చబడుదురని యేసుప్రభువు చెప్పారు. ఈ లోకంలో మానవులు దుఃఖంనుంచి పారిపోవడానికే ప్రయత్నిస్తుంటే ప్రభువు దుఃఖపడువారు దీవించ బడుదురని చెప్పారు. మనం బైబిలును జాగ్రత్తగా పఠించిన యెడల మానవులు దుఃఖించడం సహజమే యని గ్రహించగలము.

శారా చనిపోయినప్పుడు అబ్రాహాము దుఃఖించాడు. "శారా కనాను దేశమందలి హెబ్రోనను కిర్యతర్బాలో మృతి బొందెను. అప్పుడు అబ్రాహాము శారా నిమిత్తము అంగలార్చుటకును ఆమెను గూర్చి యేడ్చుటకును వచ్చెను" అని వ్రాయబడి యున్నది (ఆది 23:2). "నా ప్రాణము దేవుని కొరకు తృష్ణగొనుచున్నది.—రాత్రిం బగళ్లు నా కన్నీళ్ళు నాకు అన్న పానములాయెను" అని దావీదు పలికాడు (కీర్త 42:2-3). "నా ప్రార్థనలయందు ఎడతెగక నిన్ను జ్ఞాపకము చేసికొనుచు, నీ కన్నీళ్లను తలచుకొని నాకు సంపూర్ణానందము కలుగుటకై నిన్ను చూడవలెనని రేయింబగళ్ళు అపేక్షించుచున్నానని" పౌలు తిమోతికి తెలియజేసాడు (2 తిమో 1 : 3-4). నిరుత్సాహాన్ని అపజయాన్ని ఎదుర్కొని తిమోతి కన్నీళ్ళు విడిచాడు. ఇశ్రాయేలుకు రాబోవు తీర్పును గూర్చి ప్రకటించుటకు పంపబడినవాడు ప్రవక్తయైన యిర్మీయా. అతడు "నా జనులలో హతమైన వారినిగూర్చి నేను దివారాత్రిము కన్నీరు విడుచుచున్నట్లు నా తల జలమయముగాను, నా కన్ను కన్నీళ్ళ ఊటగాను ఉండును గాక" యని పలికాడు (యిర్మీయా 9:1).

అపొ. పౌలు ఎఫెసులోని క్రీస్తుసంఘ పెద్దలతో మాట్లాడుచు, "నేను మూడు సంవత్సరములు రాత్రింబగళ్ళు కన్నీళ్ళు విడుచుచు

ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసి కొని మెలకువగా ఉండుడి" యని చెప్పాడు (అపొ. కా. 20 : 31). దావీదు ఏకాంతములో కన్నీళ్ళు విడిచినాడు. తిమోతి నిరుత్సాహ పరుడై దుఃఖించాడు. యిర్మీయా నిస్పృహ జెంది ప్రలాపించాడు, పౌలు యితరుల యెడల ఆసక్తిగలవాడై మానక కన్నీళ్లు విడిచాడు.

దుఃఖపడువారు ధన్యులు. వారు ఓదార్చబడుదురని ప్రభువు చెప్పినప్పుడు ఈ ధన్యతలో దుఃఖించువారు తమ పాపముల విషయమై దుఃఖము కలిగినవారు. తమ హృదయములను దేవునికి దీనమనస్సుతో సమర్పించినవారు. నా పాపములవలననే ఆయన సిలువ వేయబడెనని ఏడ్చువారు. అట్టివారు తప్పక ఓదార్చబడుదురు. దుఃఖపడువారు ధన్యులని ప్రభువు చెప్పినప్పుడు దేని నిమిత్తము దుఃఖించు చున్నారో ఆయన చెప్పలేదు, గాని ఈ వచనానికి ముందు, దీని తరువాత ఆయన చెప్పిన మాటలను బట్టి ఈ లోక సంగతులను గూర్చి దుఃఖించు వారిని గూర్చి ఆయన చెప్పియుండలేదు. ఒకడు తన ఆత్మీయ స్థితిని ఎరిగినవాడై దుఃఖించిన యెడల ఓదార్చబడును. "నలిగిన హృదయ మును ఎవడు సహింపగలడు?" అని అందుకే సొలొమోను వ్రాసాడు (సామె 18:14). దుఃఖించువారు ఓదార్చబడుదురు. ఎప్పుడు? పరలోక రాజ్యము వారిదైనప్పుడు. "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు. పరలోక రాజ్యము వారిది" యని ప్రభువు ముందే చెప్పారు. తమ ఆత్మ విషయమై దుఃఖము కలిగి, కృంగిన హృదయముతో దేవునికి తమ్మును తాము సమర్పించుకొన్నప్పుడు, "వారి దుఃఖాన్ని దేవుడు ఓదార్చుతాడు. తన సంఘముతో చేర్చుకొంటాడు.

ప్రభువైన యేసుక్రీస్తు తన దుఃఖాన్ని, విచారాన్ని తప్పించుకొనుటకు ఎన్నడు ప్రయత్నించలేదు, తన శిష్యులు కూడ దుఃఖాన్ని ఎదుర్కొనరని ఆయన బోధించలేదు. అయితే వారి దుఃఖాన్ని

ఓదార్చి వారి జీవితాలను మార్చగలనని ఆయన హామీ యిచ్చారు. మనం ఆత్మీయ విషయాలను గూర్చి దుఃఖించునప్పుడు క్రీస్తును కలిగి యుండిన యెడల ఆత్మీయంగా బలవంతులము కాగలము. మానవుడు మూడు రకములైన దుఃఖాన్ని సాధారణంగా ఎదుర్కొంటాడు.

మొదటిది స్వాభావిక సిద్ధమైన దుఃఖము. ఇది ప్రతివానికి కలుగును. ధనికులేమి, బీదవారేమి, విద్యావంతులేమి, విద్యావిహీనులేమి, రక్షింపబడిన వారేమి రక్షింపబడని వారేమి అందరు ఈ దుఃఖాన్ని అనుభవిస్తారు. యెరూషలేముద్వారములు కాల్చబడెనని దాని గోడలు కూలగొట్టబడెనని నెహెమ్యా వినినప్పుడు అతడు కూర్చొని ఏడ్చాడు. ఎఫెసులోని సంఘ పెద్దలను ఆఖరుగ పౌలు చూచినప్పుడు వారొకరి నొకరు పట్టుకొని ఏడ్చిరి. వారందరు చాల ఏడ్చిరి, విశేషముగా దుఃఖించిరని వ్రాయబడియున్నది (అపొ. కా. 20:36-38). యిది స్వాభావిక సిద్ధమైన దుఃఖము లేక ఏడ్పు. ఈ దుఃఖము వలన ఒకడు తనకు సంభవించుచున్న బాధను తట్టుకోగలడు. యిది ఆరోగ్యకరమైన దుఃఖము. బహిరంగముగా దుఃఖమును వ్యక్తపర్చుట బలహీనత యని కొందరు తలుస్తారు. స్వాభావిక దుఃఖము గాక అస్వాభావిక దుఃఖము బలహీనతను బయలుపరుస్తాది. స్వార్థపరులు సాధారణంగా ఇట్టే ఏడుస్తారు. స్వార్థపరులు యితరులను తమ ప్రయోజనాల కొరకు కపట ప్రేమతో వాడుకొంటారు. వారి కపటము బయట పడగానే ఏడుస్తారు. అది బలహీనత.

భయమువలన కొందరు ఏడుస్తారు. రేపటిని గూర్చిన భయం, జీవితంలో సంభవించుచున్న మార్పులను గూర్చిన భయం; చివరికి మరణాన్ని గూర్చిన భయంవలన ఏడుస్తారు. ఇది అస్వాభావిక దుఃఖము.

మూడవది దైవచిత్తానుసారమైన దుఃఖము. యిది రక్షణార్థమైన మారుమనస్సును కలిగించును. యేసుప్రభువు చెప్పిన మొదటి

ధన్యత ననుభవించిన వారికిట్టి దుఃఖము కలుగును. అట్టివారు ఆత్మ విషయమై దీనులైనవారు. విరిగి నలిగిన హృదయం గలవారు. రక్షింపబడాలంటే ఒకడు ఏమి చేయవలెనో తెలిసికొనిన తరువాత ఒకడు తన బలహీనత నంగీకరించి యేసు ప్రభువునందు విశ్వాసముంచవలెను. పాపముల విషయమై మారుమనస్సు బొందవలెను. పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. దీనమనస్సుగలవారు దేవుని ఆజ్ఞలకు ఎదురు చెప్పకుండా లోబడతారు. అట్టివారి కన్నుల ప్రతి బాష్పబిందువును ఆయన తుడిచివేయును. మరణము ఇక ఉండదు. దుఃఖమైనను, ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు" (ప్రకటన 21:4). నిజమైన ఆదరణ యేసుప్రభువులోనే యున్నది. దుఃఖపడువారు ధన్యులు, వారు ఓదార్చబడుదురు. అందుకే ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్తమైన వారలారా నాయొద్దకురండి; నేను మీకు విశ్రాంతి నిత్తును అని యేసుప్రభువు పిలుచుచున్నాడు. నీ వాయన పిలుపునకు లోబడెదవా? —జాషువా గూటం.

—o—

## విధేయతలో విజయం, అవిధేయతలో అపజయం

"చెడు పనులు చేయుట బలహీనునికి ఆటగా నున్నది. వివేకునికి జ్ఞాన పరిశ్రమచేయుట అట్టిదే" (సామె 10:23).

కయీను : "...వాడు దుష్టుని సంబంధియై తన సహోదరుని చంపెను. వాడతని ఎందుకు చంపెను? తన క్రియలు చెడ్డవియు తన సహోదరుని క్రియలు నీతిగలవియు అయినందుననేగదా?"

యెహోవా కయీనుతో-నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? నీవు సత్క్రియ చేసినయెడల తల నెత్తికొనవా? సత్క్రియ చేయనియెడల వాకిట పాపము పొంచియుండును. నీయెడల దానికి వాంఛకలుగును. నీవు దానిని ఏలుదువు? "అమ్మోరీయులకు క్రమ

వారు కయీను నడచిన మార్గమున నడచిరి". "మనము కయీనువంటి వారమై యుండరాదు" (1 యోహా 3:12, ఆది. కా. 4:6-7, యూదా 1:11)

**హనోకు** : "విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను; అతడు కొనిపోబడకమునుపు దేవునికి ఇష్టుడైయుండెనని సాక్ష్యము పొందెను". కాగా అతడు కొనిపోబడెను గనుక అతడు లేకపోయెను". "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది, దైవకృప కలిగియుందము! ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు" హెబ్రీ 11:5, 12:28-29.

**అబ్రహాము** : విశ్వాసులకు తండ్రి అనబడిన అబ్రహాము దేవుని పిలుపునకు విధేయుడై నిలిచినందున "నిన్ను గొప్ప జనముగా జేసి నిన్ను ఆశీర్వదించి నీ నామము గొప్ప చేయుదును..." అని దేవుడే చెప్పెను (ఆది. కా. 12 : 2). "ప్రభువు మెచ్చుకొనువాడే యోగ్యుడు గాని తన్ను తానే మెచ్చుకొనువాడు యోగ్యుడు కాదు" (2 కొరి 10:18).

**యోసేపు**: ఫరో భార్య పతనపు కోరల్లో ఇరుక్కోకుండా తనకు కలిగిన స్వాతంత్రము తాను నమ్మిన దేవుని చిత్తమునకు లోపరచి దుర్నీతికి దూరంగా పారిపోయాడు. తనకుతాను, తన ప్రజలను, దేశాన్ని ధేశదేశాలను ఆపదనుండి కాపాడగలిగాడు (ఆది కా. 39 : 6-20, 41 : 36-46). "నీ యౌవనమును బట్టి ఎవనిని తృణీకరింపనీయకుము" (1 తిమో 4:11-12, 5 1-2).

**బిలాము** : "బిలాము దుర్నీతి వలన కలుగు బహుమానమును ప్రేమించెను; అయితే తాను చేసిన అతిక్రమము నిమిత్తము అతడు గద్దింపబడెను, ఎట్లనగా నోరులేని గార్దభము మానవ స్వరముతో మాటలాడి ఆ ప్రవక్తయొక్క వెర్రితనము అడ్డగించెను".

"...నీ మీద కొన్ని తప్పిదములు మోపవలసి యున్నది. అవి ఏవనగా, విగ్రహములకు బలి ఇచ్చిన వాటిని తినునట్లును, జారత్వము చేయునట్లును, ఇశ్రాయేలుకు ఉరి యొడ్డుమని బాలాకునకు నేర్పిన బిలాము బోధను అనుసరించువారు నీలో ఉన్నారు".

"అయ్యో! వారికి శ్రమ; వారు...బహుమానము పొందవలెనని బిలాము నడిచిన తప్పుత్రోవలో ఆతురముగా పరుగెత్తిరి" (2 పేతురు 2:15-16, ప్రక 2:14, యూదా 11).

మోషే : "మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటె, దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు; ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమునందు దృష్టి యుంచెను. విశ్వాసమును బట్టి అతడు అదృశ్యుడైనవానిని చూచుచున్నట్టు స్థిరబుద్ధి గలవాడై రాజాగ్రహమునకు భయపడక ఐగుప్తును విడిచిపోయెను. తొలిచూలు పిల్లలను నాశనము చేయువాడు ఇశ్రాయేలీయులను ముట్టకుండు నిమిత్తము అతడు విశ్వాసమును బట్టి పస్కాను రక్త ప్రోక్షణ ఆచారమును ఆచరించెను. విశ్వాసమును బట్టి వారు పొడినేలమీద నడిచినట్లు ఎర్ర సముద్రములోబడి నడిచి పోయిరి" (హెబ్రీ 11:24-29).

"ధనాపేక్ష సమస్త కీడులకు మూలము". "సంతృప్తి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధకమై యున్నది" (1 తిమో 6:5-10).

—పాల్ గూటం, గొల్లపల్లి-533 222.

—o—

[Title 2nd Page afterwards]

ఆయన స్వరక్తముచే కొనబడిన సంఘము ఆయన నామమున పిలువబడనవుసరము లేదని భావించువారు దేవునికి, క్రీస్తుకు, పరిశుద్ధాత్మనికి విరోధులు. వేరే నామము ధరించిన ఏ సంఘము క్రీస్తుకు సంబంధములేని మానవకల్పిత సంఘమని తెలియజేసిరి. దైవోక్తులను దేవోక్తులుగ మాటలాడి స్వచ్ఛమైన క్రీస్తు మాటలను సోదరులు సరళమైన భాషలో అందించిరి. డి. అబ్రహాముగారు చక్కటి పాటలను పాడి వినిపించిరి. సదస్సును బూల యోహానుగారు, M. కిరణ్ కుమార్ గారు ప్రార్ధనలో నడిపించిరి. సువార్తికులు కరపత్రికలు పంచుచూ తమ తమ గ్రామములకు తిరిగి వెళ్లిరి. సోదరులు M. సాల్మన్ గారు జి. కొత్తూరులోను పరిసర ప్రాంతాలలోను క్రీస్తు సేవను జరిగించుచున్నారు.

మార్చి నెల 23, 24, 25 తేదీలలో కృష్ణాజిల్లా తిరువూరులో గొప్ప సువార్త సభలు జరిగెను. దానిలో సోదరులు G. మార్కు, K. ఇశ్రాయేలు, మేడూరి రూబెన్, T. ప్రసాదరావ్, ఎలీషాపీటర్, జాషువా గూటం ఉపన్యసించిరి. ప్రతి కూటమునకు వందలాది ప్రజలు హాజరై క్రొత్తనిబంధన సత్యములను విని ఆనందించిరి. ఇద్దరు స్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. తిరువూరులోను, పరిసరప్రాంతములలోను సోదరులు ఇందుపల్లి ఇశ్రాయేలుగారు చక్కని సేవ చేయుచున్నారు.

మార్చి 26వ తేదీ ఉదయం కృష్ణాజిల్లా మల్లెల గ్రామములో క్రీస్తు సంఘ ఆలయ నిర్మాణమునకు జాషువా గూటంగారు శంఖుస్థాపన చేసిరి. స్థానిక సంఘస్థులు, పలుపురు ప్రముఖులు ఈ కార్యక్రమమునకు హాజరైరి. మల్లెలలో వంగూరి ప్రకాశరావుగారు సువార్తపని చేయుచున్నారు. మధ్యాహ్నం కూనపరాజుపర్వ అనే గ్రామంలో క్రీస్తు సంఘ నూతన ఆలయ ప్రవేశము జాషువాగారి

ద్వారా జరిగించబడెను. సభ అనంతరము 7 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కూనపరాజు పర్వలో గంటా ఫిలిప్పుగారు మంచి సువార్త పని చేయుచున్నారు.

మార్చి 19వ తేదీ శనివారం శ్రీకాకుళం-విజయనగరం జిల్లాల సువార్తికుల సదస్సు శ్రీకాకుళంలో **R. Ch.** సద్గుణరావ్‌గారి ఆధ్వర్యమున జరిగెను. ఇంచుమించు 25 మంది సువార్తికులతో ఈ సదస్సు ఆరంభమాయెను.

మార్చి 30, 31, ఏప్రియల్ 1లో కర్నాటకలో **K.G.F.**లో జరుగబోయే సువార్త కూటములలో పాల్గొనడానికి ఈ పత్రిక ముద్రించు సరికి జాషువాగారు బయలుదేరి వెళ్లారు.

---

**Regd. No. H/KD—45/KD H.O.**

*From*
**SATYA WAKKU**
**P.O. Box 80**
**KAKINADA 533 001**

**No.**

**To**

..............................
..............................
..............................
..............................